క్లుప్తంగా

పాఠశాలలను బలోపేతం చేయాలి



పర్వతగిరి: పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని పర్వతగిరి జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం ప్రాథమిక స్థాయి, యూపీ లెవల్ తెలుగుభాష స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడారు. కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్‌బాబు, వెంకటరమణారెడ్డి, డాక్టర్ భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నాగపడిగె రూపంలో తాటిగెల



నర్సంపేట రూరల్: నర్సంపేట మండలం ముగ్దుంపురంలోని ఓ తాటిచెట్టుపై బుధవారం నాగపడిగె రూపంలో తాటిగెల కనిపించింది. వృత్తిలో భాగంగా గీతకార్మికుడు బైరగోని సత్యం తాటిచెట్టు ఎక్కగా నాగపడిగె రూపంలో గెల కనిపించింది. దీంతో ఆ గెలను కిందకు తీసుకొచ్చి తోటి గీతకార్మికులకు చూపించారు.

చెక్కు అందజేత



చెన్నారావుపేట: మండలంలోని పదహారు చింతల్ తండాకు చెందిన లకావత్ సాల్కి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతుంది. దీంతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ అందించారు. ధన్‌సింగ్ ఉన్నారు.

శ్రీనివాస్‌కు సేవారత్న అవార్డు

గీసుకొండ: 16వ డివిజన్ ధర్మారానికి చెందిన వల్లెం శ్రీనివాస్ జాతీయ సేవారత్న–2024 అవార్డును మంగళవారం న్యూఢిల్లీలో స్వీకరించారు. అంతర్జాతీయ బహుజన సాహిత్య సేవారత్న ఫౌండర్ నల్లల రాధాకృష్ణ బహుజన సాహిత్య అకాడమీ జాతీయ సదస్సులో ఈ అవార్డును శ్రీనివాస్‌కు అందజేశారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి: ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

రాయపర్తి: మండలంలోని పెర్కవేడులో పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా బూత్ కమిటీలను ఎన్నిక చేసినట్లు బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు నూనె అనిల్ బుధవారం తెలిపారు. బూత్ కమిటీ అధ్యక్షులుగా కూన యాదగిరి, రాసాల రాకేష్, రాజును ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎనగందుల శ్రావణ్‌కుమార్, అనిల్, సుధాకర్, సుమన్, రాకేష్, నిఖిల్, రామకృష్ణ, సంపత్, సాయికుమార్, నవీన్ పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ మండల కార్యవర్గం..

ముదిరాజ్ మహాసభ మండల కార్యవర్గాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన ముద్రబోయిన వెంకటేశ్వర్లును మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. మండల ప్రధానకార్యదర్శిగా కనుకుంట్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా షాపురం సాయిలు, కాయిత వెంకన్న, కనుకుంట్ల యాకయ్య, మండల యూత్ అధ్యక్షుడిగా నర్సింహుల రమేష్, ప్రధానకార్యదర్శిగా సుధాకర్‌లను ఎన్నిక చేశారు. చీఫ్‌ప్రమోటర్ చొప్పరి సోమయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి నీరటి సదానందం, పోలు అమర్చంద్, కాశీనాథం, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష

కాశిబుగ్గ సెంటర్: వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించడం వల్ల బోర్డు పరీక్షల్లో అధిక మార్కులు పొందుతారని తెలిపారు. తెలంగాణ జీవశాస్త్ర ఫోరం జిల్లా, రాష్ట్రస్థాయిలో పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాస్థాయి విజేతలకు ఈనెల 28న రాష్ట్రస్థాయి పరీక్షలు ఉంటాయని వివరించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్ఆఫ్ చేయడం మంచిది.

ఇక చెత్తకు చెక్!

- 23 లిట్టర్ ఫ్రీ జోన్ల రోడ్లు, ప్రాంతాల గుర్తింపు
- త్వరలో నోటిఫికేషన్ జారీకి సన్నాహాలు
- రోడ్లపై చెత్త వేస్తే జరిమానా
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు

వరంగల్ అర్బన్: నగరాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో పారిశుధ్యం మొదటిది. ఈ సమస్యకు చెక్ పెట్టడానికి అధికారులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాల్ని ఇక్కడా అమలు చేసేందుకు ప్రజాధనం కోట్లు కుమ్మరిస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. ఈక్రమంలో తాజాగా.. రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు గ్రేటర్ నగరంలో లిట్టర్ ఫ్రీ జోన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో బల్దియా ప్రజారోగ్యం అధికారులు నగరవ్యాప్తంగా ప్రధాన రహదారులు, పార్కులు, చెరువులు, పర్యాటక ప్రాంతాలు, జన సామర్థ్యం కలిగి ఉన్న ప్రాంతాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో నోటిఫికేషన్ జారీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

చెత్త వేస్తే జరిమానా..

లిట్టర్ ఫ్రీ జోన్‌లో భాగంగా ఎవరైనా రోడ్లపై చెత్త, పడేస్తే రూ.500 నుంచి రూ.10 వేల వరకు జరిమానా విధించాలనే నిబంధనలున్నాయి. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, వ్యాపార, వాణిజ్య షాపుల లైసెన్స్ రద్దు చేయాలని భావిస్తున్నారు. వీటిని కఠినతరం చేస్తుండడంతో పాటు నగరంలోని ప్రధాన రహదారుల్లో కమర్షియల్ భవనాల నుంచి విధిగా వాహనాల ద్వారా రోజువారీగా చెత్తను సేకరించేందుకు సమాయత్తమవుతున్నారు. గతంలో 17 ప్రధాన రహదారులకు సంబంధించిన 44 కిలోమీటర్ల లిట్టర్ ఫ్రీ రోడ్లతో పాటు మరో 6 రహదారులను పరిగణనలోకి తీసుకోనున్నారు. బాధ్యతాయుతంగా క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్మికులు, జవాన్లు, వాహనాల డ్రైవర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తే లిట్టర్ ఫ్రీ సిటీ సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



వరంగల్ పాత బీట్ బజార్‌లో రోడ్డుపై చెత్త

బల్దియాకు 40 మంది పర్మనెంట్ ఉద్యోగులు

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 40 మంది పర్మనెంట్ ఉద్యోగులను కేటాయిస్తూ రాష్ట్ర పురపాలకశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్–4 సెలక్ట్ అయిన వీరికి ఇటీవల పురపాలక శాఖ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ పోస్టింగ్ ఇచ్చారు. దీంతో రెండు, మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నారు. నలుగురు జూనియర్ అకౌంటెంట్లు, ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు, 30 మంది వార్డు ఆఫీసర్లను కేటాయించారు. కొద్ది నెలల కిందట 38 మంది వీఆర్‌ఓలు, ఆరుగురు వీఆర్‌ఏలు బల్దియాకు కేటాయించడంతో, మరికొంత మంది బల్దియా పర్మనెంట్ ఉద్యోగులతో కలిపి 66 డివిజన్లకు వార్డు ఆఫీసర్లను నియమించారు. వీఆర్‌ఓలు, కొత్తగా చేరనున్న వార్డు ఆఫీసర్లతో బల్దియా సాధారణ పరిపాలన విభాగం బలోపేతం కానుంది.

కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట: అజాంజాహి మిల్లు కార్మికులు కొనుగోలు చేసి భవనం నిర్మించి కాపాడుకున్న స్థలాన్ని కాజేయడానికి భవనాన్ని కూల్చివేసి తప్పుడు పత్రాలతో కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అజాంజాహి మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజాంజాహి మిల్లు కార్మికులు మిల్లు నడుస్తున్న సందర్భంలో చందాలు వేసుకొని 12గుంటల స్థలాన్ని తమ సంఘ కార్యకలాపాల కోసం కొనుగోలు చేసి పెద్ద భవనాన్ని నిర్మించుకున్నారు. పాలకుల నిర్లక్ష్యంతో మిల్లు మూతపడగా ఆ స్థలంపై కన్నేసిన భూ కబ్జాదారులు అధికార పార్టీలను మచ్చిక చేసుకొని కాజేయాలని తప్పుడు పత్రాలు సృష్టించి గత ప్రభుత్వ హయాంలో ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారన్నారు. కార్మికులు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలకు నాటి కాంగ్రెస్ నాయకులు అండగా నిలిచారన్నారన్నారు. కానీ, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు కార్మికులు నిర్మించుకున్న భవనాన్ని.. కబ్జాదారులకు అండగా నిలిచి కూల్చివేయడం అన్యాయమన్నారు. గోనె కుమారస్వామి, మంద రవి, నర్ర ప్రతాప్, సుంచు జగదీశ్వర్, ఐతమ్ నాగేశ్ పాల్గొన్నారు.

బుధరావుపేటలో గడ్డి దగ్ధం

ఖానాపురం: మండలంలోని బుధరావుపేటకు చెందిన ఎలంశెట్టి ప్రసాద్ తన మూడున్నర ఎకరాల పొలంలోని గడ్డిని ఇంటి వద్ద నిల్వ చేశాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డి పూర్తిగా దగ్ధం కావడంతోపాటు ట్రాక్టర్ ట్రాలీ స్వల్పంగా దగ్ధమైంది. గమనించిన రైతు ప్రసాద్ ట్రాలీలో ఉన్న గడ్డిని గ్రామ శివారు వరకు తీసుకెళ్లి ట్రాలీ నుంచి తొలగించాడు. ఈ ప్రమాదంలో రూ.50 వేల నష్టం వాటిల్లిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు ప్రసాద్ తెలిపారు.

ఇటుక బట్టి కార్మికుల కూలి రేట్లు పెంచాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దయాకర్



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

నర్సంపేట: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇటుక బట్టి కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో బుధవారం బరిగెల కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దయాకర్ మాట్లాడారు. కార్మికుల శ్రమను యాజమాన్యాలు గుర్తించకుండా తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తూ వారు పని చేసే ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు మెరుగుపర్చడం లేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గొర్రె ప్రదీప్, బ్రిక్స్ అండ్ ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ నాయకులు సంగి సురేశ్, చొప్పరి రాజు, దేవేందర్, కుమార్, చొప్పరి రమేశ్, రవి, భిక్షపతి, యోగేశ్వర్, రాంబాబు, శ్రీనివాస్, రమేశ్, నందం కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా హమాలి కూలి రేట్లు పెంచాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్కెట్ ఖరీదు, ఫర్టిలైజర్ యూనియన్, ఐరన్ అండ్ మర్చంట్ యూనియన్ అధ్యక్షుడు వంగేటి గోవర్ధన్, దోమకుంట్ల సురేష్, బూర అశోక్‌లకు బుధవారం బీఆర్‌టీయూ, ఏఐటీయూసి అనుబంధ హమాలీ సంఘం ఆధ్వర్యంలో నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, ఏఐటీయూసి జిల్లా నాయకుడు గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు నూతన రేట్ల ఒప్పందం ఉంటుందని, డిసెంబర్ 21తో ఆ గడువు ముగుస్తుందన్నారు. నాయకులు గుండెబోయిన కొమురయ్య, నాగులు, చంద్రమౌళి, శ్రీనివాస్, రాములు, రమేష్, ఎలేందర్ పాల్గొన్నారు.

కనులపండువగా నారికేళ పడిపూజ



అయ్యప్పకు అభిషేకం నిర్వహిస్తున్న స్వాములు



విరాళం అందజేస్తున్న దాతలు

సంగెం: అయ్యప్ప నామస్మరణతో బుధవారం సంగెం మండల కేంద్రం మార్మోగిపోయింది. సంగెంలో గురుస్వామి నల్ల శంకర్, రజిత దంపతుల కుటీరంలో గురుస్వామి కేసముద్రం ధర్మశాస్త ఆలయ ప్రధాన తంత్రి విష్ణునారాయన్ కుట్టి ఆధ్వర్యంలో నారికేళ పడిపూజ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. గోవిందరాజు, ప్రభాకర్, లక్ష్మణ్, శరత్, అనిల్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేక పూజలు

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బుధవారం అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓంసాయి రియల్ ఎస్టేట్ నర్సంపేట, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, రుద ఓంప్రకాశ్‌మల్లేశ్వరి, శింగిరికొండ ఉపేందర్, కరుణాకర్‌రెడ్డికవిత, కృష్ణహైమ, శ్రావణి, అమిత్‌కుమార్‌స్వరూప, పోటు రవీందర్‌రెడ్డిసాంబలక్ష్మి, తోటకూరి రాజు, సాంబయ్యగౌడ్, కారు, రవీందర్‌దీప్తి, పావనివేణు, వెంకటేశ్వర, సునితరామస్వామి, యాదగిరిరావు, నరసింహారెడ్డి, రాజేష్, ప్రభాకర్, వాసు, సాంబరెడ్డి, సోమలింగం, రాజు, ఆలయ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రెడ్డి, కోశాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పడిపూజకు విరాళం

గీసుకొండ: గీసుకొండలో అయ్యప్ప పడిపూజ నిర్వహణకు స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ–గీత దంపతులు రూ.50,116 నగదును బుధవారం విరాళంగా అందించారు. కుమారస్వామి, సుధీర్, యాదగిరి, లక్ష్మణ్, నరిశెట్టి శ్రీనివాస్, కనకయ్య, హరీశ్ పాల్గొన్నారు.

నేరాలు – ప్రమాదాలు

చికిత్స పొందుతున్న మహిళ మృతి



లక్ష్మి(ఫైల్)

వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మహిళ బుధవారం రాత్రి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేట పట్టణానికి చెందిన కొండేటి లక్ష్మి(65) ఈ నెల 12న ఎస్సీ కాలనీ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో శుభకార్యానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో వరంగల్ నుంచి సూర్యాపేట వెళ్తున్న డీసీం వ్యాన్ ఆమెను బలంగా ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జీపీ కార్మికుడి మృతి

రాయపర్తి: కట్టెలు కొడుతుండగా ప్రమాదశాత్తు కర్ర తగిలి గ్రామపంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని మొరిపిరాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందించారు. పంచాయతీ కార్యదర్శి సోమరాజు, యాకూబ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సాయమ్మ(ఫైల్)

దుగ్గొండి: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దామెర సాయమ్మ(104) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. సాయమ్మ కుమారుడు దామెర సమ్మయ్య నిరుపేద కుటుంబానికి చెందినవాడు కావడంతో గ్రామస్తుల సాయంతో సాయమ్మ దహనసంస్కారాలు నిర్వహించారు.

గీత కార్మికుడికి గాయాలు

నెక్కొండ: తాటిచెట్టుపై నుంచి పడడంతో గీత కార్మికుడు తీవ్ర గాయపడ్డాడు. తోటి గీతా కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండకు చెందిన తాళ్లపెల్లి చెన్నకేశవులు పత్తిపాక తాటి వనానికి బుధవారం ఉదయం వెళ్లాడు. చలి తీవ్రంగా ఉండడంతో పట్టు తప్పి చెట్టుపై నుంచి జారి పడ్డాడు. ఈ ప్రమాదంలో చెన్నకేశవులు నడుము, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని వారు పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీ

ఖానాపురం: అశోక్‌నగర్ శివారులోని పాకాల వైన్స్‌లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజూ మాదిరిగానే నిర్వాహకులు మంగళవారం రాత్రి వైన్స్‌ను మూసివేసి వెళ్లారు. కాగా, రాత్రి సమయంలో ఆగంతకులు వైన్స్ రేకులను తొలగించి లోపలకు ప్రవేశించారు. రూ.37,100 నగదు, రెండు బాలెంటైన్స్, ఒక ఆంటిక్విటీ, రెండు రెడ్ లేబుల్ మద్యం ఫుల్‌బాటిళ్లను అపహరించారు. దీంతోపాటు సీసీ కెమెరాల ఫుటేజీ పరికరాలను సైతం తీసుకెళ్లారు. బుధవారం ఉదయం వైన్స్‌ను తెరిచిన నిర్వాహకులు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసుకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని దుగ్గొండి సీఐ సాయిరమణ పరిశీలించారు. క్లూస్‌టీం ఆధ్వర్యంలో వివరాలను సేకరించారు. యజమాని ముఖేష్ ఫిర్యాదును స్వీకరించి పోలీసులు విచారణ చేపట్టారు.

రుద్రగూడెంలో మరో చోరీ

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెం గ్రామంలో ఓ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రఘుసాల హనుమంత్ ఇంటి తాళం పగులగొట్టిన ఓ బాలుడు బీరువాలోని రూ.10వేలు గ్లూకో మీటర్ అపహరించుపోయాడు. చోరీకి పాల్పడిన బాలుడు నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లెకు చెందినవాడిగా స్థానికులు గుర్తించి పోలీసులకు తెలిపారు. ఈ మేరకు బాధితుడు హనుమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

లక్ష్యాన్ని ఎంచుకోవాలి

ఖిలా వరంగల్: విద్యార్థులు విద్యతోపాటు వివేకాన్ని పెంచుకుని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట జంక్షన్‌లోని నానిగార్డెన్‌లో వడుప్సా వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో బొల్లం కనకయ్య అధ్యక్షతన బుధవారం పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సహకారం



బాలిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామస్తులు

గీసుకొండ: మండలంలోని మరియపురంను జాతీయ ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దిన మాజీ సర్పంచ్, నిర్మల బైండింగ్ వర్క్స్ అధినేత అల్లం బాలిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం స్వగ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల బోధన, బోధనేతర సిబ్బందికి దుస్తుల కోసం బాలిరెడ్డి రూ.35 వేలు అందించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే తనిఖీ



సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ అరుంధతి

దుగ్గొండి: మండలంలోని శివాజినగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల ఇంటింటి సర్వేను ఎంపీడీఓ లెక్కల అరుంధతి బుధవారం తనిఖీ చేశారు. ఇంటింటికి వెళ్లి యాప్‌లో వివరాల నమోదు, ఇంటి పరిస్థితి, స్థలం వివరాల నమోదును జీపీఆర్ఎస్ ఫొటో తీస్తున్నారా.. లేదా.. అనే విషయాలను పరిశీలించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీఓ శ్రీధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి రజిని పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో వరంగల్ రోడ్డు చర్చి రూబిన్ పాస్టర్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. అనంతరం మార్కెట్ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద్‌రాజు, బోడ రవికుమార్, రూబెన్, వై.మిల్టన్, జాన్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు



స్థల పరిశీలన చేస్తున్న నాయకులు, అధికారులు

నర్సంపేట: నర్సంపేట పట్టణంలో మెరుగైన విద్యుత్ సరఫరాకు స్థానిక ఎమ్మెల్యే మాధవరెడ్డి సహకారంతో చర్యలు చేపడుతున్నామని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ అన్నారు. ఈ మేరకు నర్సంపేట పట్టణం ద్వారకపేట రోడ్డులోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాల పరిధిలో నూతన ట్రాన్స్ ఫార్మర్, పది కరెంటు స్తంభాలు ఏర్పాటుకు బుధవారం ఏఈ విజయ్‌భాస్కర్‌తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 24వార్డుల్లో ఇప్పటికే విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతూ మెరుగైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు అవసరం ఉన్న చోట నిర్మాణాలు చేపడతామన్నారు.

స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



దుప్పట్లు పంపిణీ చేసిన అనంతరం విద్యార్థినులతో ఫ్లోరెన్స్

నల్లబెల్లి: విద్యార్థినలకు దుప్పట్లు పంపిణీ చేసిన స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జిల్లా జీసీడీఓ ఫ్లోరెన్స్ అన్నారు. ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ నిర్వహకులు స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల 6వ తరగతి విద్యార్థినులకు బుధవారం దుప్పట్లు అందజేశారు. చలితీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు అడ్డ రాజు, ప్రశాంత్, వినయ్ పాల్గొన్నారు.

‘ప్రభుత్వానివి అసత్య ప్రచారాలు’

వర్ధన్నపేట: కాంగ్రెస్ ప్రభుత్వం అసత్య ప్రచారాలతో పబ్బం గడుపుతోందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. డిసెంబర్ 9వ తేదీన సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా రైతు పండుగ పేరుతో మహబూబ్‌నగర్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి రైతులకు రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తున్నామని చెప్పి అన్ని ప్రధాన పత్రికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుందన్నారు. బహిరంగ సభ ముగిసినా ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసత్య ప్రచారాలు మాటలు మానుకుని పనులు చేసి చేతల్లో చూపించాలన్నారు.